

కళా మారుతి వేదిక ప్రారంభోత్సవంలో జనార్దనమూర్తి, పాలక వర్గ సభ్యులు

గానసభలో మరో కళావేదిక ప్రారంభం

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభలో గతంలో నాలుగు వేదికలపై సంగీత, నృత్య, నాటక, సాహిత్య కార్యక్రమాలు జరిగేవి. వీటికి తోడుగా మరో కళావేదికను శుక్రవారం ప్రారంభించారు. గానసభ మొదటి అంతస్తులో కళా మారుతి వేదికను గానసభ పాలకవర్గసభ్యులు అధ్యక్షుడు కళా జనార్దనమూర్తితో కలిసి ప్రారంభించారు. కళాకారులకు వేదికలను సౌకర్యాలతో అందిస్తున్నామని, 365 రోజులు సినీ గీతాలు, కమర్షియల్ కార్యక్రమాలు తప్ప అన్నింటికీ ఉచితంగా ఇస్తున్నామని జనార్దనమూర్తి తెలిపారు. హాస్యావధాని, జర్నలిస్ట్ శంకరనారాయణ మాట్లాడుతూ.. వేదికలు ఎన్ని ఉన్నా కొరత ఉందని, కళాకారులు గానసభ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలక వర్గసభ్యులు గుండవరపు విద్యాసాగర్, జంగంరావుగౌడ్, గుండవరపు గీతాదేవి, చక్రపాణి, ప్రసాద్, భమిడి ఉష, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మకు తొలి బోనం సమర్పణ

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగర గ్రంథాలయ సంస్థ ప్రాంగణం లోగల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం తొలిబోనం సమర్పించినట్లు లైబ్రరీ ఉద్యోగి మందల యాదమ్మ తెలిపారు. సిటీసెంట్రల్ లైబ్రరీ స్థాపించక ముందు నుంచి బావిలో ఎల్లమ్మ దేవత వెలిసిందని తెలిపారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి తొలి బోనం సమర్పించామన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో యధావిధిగా రిజిస్ట్రేషన్లు

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్లు యధావిధిగా జరిగాయని సబ్‌రిజిస్ట్రార్ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం రిజిస్ట్రేషన్ శాఖ సెంట్రల్ సర్వర్ డౌన్ కావడంతో రెండు రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయన్నారు.

కనులపండువగా శతకలశాభిషేకం

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ స్కంధషష్టి సందర్భంగా శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీదేవాలయ ఆవరణలోని సుబ్రహ్మణ్య స్వామి మందిరంలో కనులపండువగా శతకలశాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈవో లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'కేటాయించిన స్థలంలోనే వాహనాలను పార్క్ చేయాలి'

ముషీరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ దేవుని తోటలో భవానీ శంకర దేవాలయ ప్రాంగణంలో కేటాయించిన స్థలంలోనే వాహనాలను పార్క్ చేయాలని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్‌కు టెండర్ నిర్వహించారు. రూ. 3.55 లక్షలకు బి. జయకృష్ణ దక్కించుకున్నాడు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది, సురేష్, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి'

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థులు అందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీసీ ఐక్యవేదిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఐక్యవేదిక సమావేశం జరిగింది. అధ్యక్షుడు ఆరె మహేందర్ మాట్లాడుతూ.. కళాశాలలకు ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఫీజు బకాయి ఉండడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె. విజయ్‌కుమార్, ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పాండురంగం తదితరులు పాల్గొన్నారు.



డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న దిడ్డి సుధాకర్ తదితరులు

'ఆప్' విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్‌పై

న్యాయ విచారణ జరిపించాలి

కవాడిగూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి సంఘం (సీవైఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సురేష్‌ను అరెస్ట్ చేసి, చితకబాది సెల్ ఫోన్ లాక్కున్న సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ డీజీపీ జితేందర్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు బుర్రారాములుగౌడ్, మహమ్మద్ మాజీద్, మహిళా అధ్యక్షురాలు హేమ జిల్లోజు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బారావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పవార్, సంతోష్, దర్శనం రమేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.




ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

మూసీ అభివృద్ధి పేరుతో

పేదలకు అన్యాయం చేస్తే సహించబోం : సీపీఎం

గోల్నాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మూసీ అభివృద్ధి పేరుతో పేదలకు అన్యాయం చేస్తే సహించబోమని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.మహేందర్ అన్నారు. గోల్నాక డివిజన్ తులసీరాంనగర్ (లంక)లో శుక్రవారం బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను అధికారులు మార్కింగ్ చేయడాన్ని వారు ఖండించారు. పేదల ఇళ్లను కూల్చాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.రాములు, షబానా, సోమయ్య, వరలక్ష్మి, అన్నపూర్ణ, మహేష్, కిషన్ తదితరు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న స్వరాన్‌కుమార్ భట్

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వరాన్ కుమార్ భట్ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, నగదు రహిత ఆరోగ్య సేవలను అందించాలన్నారు. తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 30న చలో ఇందిరాపార్కు పేరిట ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు అరుణ, జనార్దన్‌రెడ్డి, మోత్కూరి నరహరి, కృష్ణమూర్తి, సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలు..

ఆలయాలకు చెక్కుల పంపిణీ

ముషీరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని 186 అమ్మవారి దేవాలయాల కమిటీలకు రూ. కోటి 2 లక్షల 24వేల 500ల చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని భవానీశంకర దేవాలయ ప్రాంగణంలో తహసీల్దార్ గోవర్ధన్ అధ్యక్షతన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బోనాల ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు.

రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలను ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నదని తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం బోనాల ఉత్సవాలకు 10 శాతం నిధులను పెంచిందన్నారు. కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రవిచారి, పావని వినయ్‌కుమార్, రచనశ్రీ మాట్లాడుతూ.. చిన్న దేవాలయాలకు ఎక్కువ నిధులు, పెద్ద దేవాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని బీజేపీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. అధికారులు పరిశీలించి దేవాలయాలకు నిధులను పెంచి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు కృష్ణ, నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బోనాల వేడుకలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం కాచిగూడ తుల్జాభవన్‌లో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 128 అమ్మవారి దేవాలయాలకు రూ. 50.38 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. తొలి విడతగా 74 దేవాలయాల నిర్వాహకులకు చెక్కులను అందజేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఈనెల 28న బోనాల వేడుకలు జరుగుతాయన్నారు. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. బోనాల నిధులను ముందుగా విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. బోనాల వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకోవడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు.

కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, తుల్జాభవన్ ఈవో అంజనారెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, పద్మావెంకటరెడ్డి, వై. అమృత, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, అంబర్‌పేట, హిమాయత్‌నగర్ తహసీల్దార్లు వీరాబాయి, సంధ్యారాణి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో..

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలో ప్రియా అపార్ట్‌మెంట్‌వద్దనున్న అమ్మవారి దేవాలయ నిర్వాహకులకు బోనాల పండుగకోసం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును రాజీవ్ గాంధీ నగరపాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుర్రం శంకర్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బాలకృష్ణ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.





అంబర్‌పేట, గాంధీనగర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కార్పొరేటర్లు, గుర్రం శంకర్



ముషీరాబాద్‌లో ఆలయ కమిటీ నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లు

ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువు దోమలు



దోమల నివారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డీఎంసీ, ఏఎంవోహెచ్ తదితరులు

ముషీరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువు దోమలని, వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఖాదర్ మోహినొద్దీన్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికెనుగున్యా, మెదడువాపు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయి, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక, ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపరాణి, జీహెచ్ఎంసీ సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గా ప్రసాద్, ఏఈ మహేష్ తదతరులు పాల్గొన్నారు.

అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ-గ్రేడ్

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎన్ఏఏసీ) ఏ-గ్రేడ్ గుర్తింపు లభించిందని మాజీమంత్రి, అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ఎం. శ్రీనివాస్‌రావు వెల్లడించారు. శుక్రవారం బర్కత్‌పురలో డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అవంతి గ్రూప్ ఆఫ్ కళాశాలల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంకతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థులకు డేటా సైన్స్, డేటా ఎన్‌లోట్రిక్, సైన్స్ సెక్యూరిటీ కోర్సులలో కూడా శిక్షణ ఇస్తున్నామన్నారు.

అంబేద్కర్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్. రిషికాంత్ మాట్లాడుతూ.. జనాభా నియంత్రణపై అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. జనాభా పెరుగుదల, ఆహార ఉత్పత్తి, వాటి సద్వినియోగంపై అర్థశాస్త్ర అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో ముదిగొండ భవానీ, కవిత, అన్నపూర్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్. కుమారస్వామి, డాక్టర్ బండ్ల శ్రీధర్, పి. మాధవి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి మెయిన్‌రోడ్ మెట్రోపిల్లర్ 1122 పక్కనున్న విజయలక్ష్మి ట్రేడర్స్ షాపు ఎదుట ఫుట్‌పాత్‌పై సుమారు 45-50 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

నల్లకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాల సందర్భంగా నల్లకుంటలో పలు ప్రాంతాల్లో ఆలయాల వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ యాకర అమృత జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. శుక్రవారం శివానందనగర్‌లో ఆలయం వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లో అక్రమ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్ 15 టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఓ భవన యజమాని కామన్ ఏరియాలో మెట్లు, స్లాబ్ నిర్మాణం నిర్మించాడు. ఫిర్యాదు రావడంతో అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణదారులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శ్రీధర్, అనిల్, రాజయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

'భూ' మాయ!

- రూ. 300 కోట్ల విలువైన భూమికి రెక్కలు
- నిషేధిత జాబితాలో ఉన్నా.. పాస్‌పుస్తకాలు జారీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నగర శివార్లలోని దాదాపు రూ. 300కోట్లకు పైగా విలువ చేసే 33.08 ఎకరాల పోరంబోకు భూములకు రెక్కలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఈ విలువైన భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు రావడంతో భూమిపై జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మహేశ్వరం మండలం మంఖాల్‌లోని 608, 609, 610 సర్వే నంబర్లలో 33.08 ఎకరాల భూమిని 22ఏ కింద గతంలో నిషేధిత జాబితాలో పెట్టారు. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకు/గైరానా సర్కారీగా నమోదైంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ఈ భూములకు రెక్కలు వచ్చాయి. ఆ భూమి మొత్తం పట్టా భూమిగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఫైళ్లన్నీ సచివాలయం వరకు కదిలాయి. కొందరి పేరు మీద పాస్‌బుక్‌లు కూడా ఆగమేఘాలపై జారీ చేశారు. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. ప్రభుత్వం మారడంతో దీనిపై స్థానికులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు బడా రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కలిసి ఈ భూములు కొల్లగొట్టారని దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రభుత్వానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు టాస్క్‌ఫోర్స్ బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. తహసీల్దార్ విజయలక్ష్మి సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ విచారణ జరుపుతున్నారు. ఈ భూమి వ్యవహారంపై రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

1975 నుంచి రికార్డులు గల్లంతు

మంఖాల్‌లోని ఈ భూములకు సంబంధించిన రికార్డులు కొన్ని గల్లంతైనట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే తొలుత ఈ భూమి సేత్వారీలో పట్టాగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. తరువాత కొన్నాళ్లు ప్రభుత్వ రికార్డుల్లో అలానే కొనసాగినప్పటికీ 1975నుంచి ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులు గల్లంతయ్యాయి. అనుభవదారుల కాలమ్‌లో కొందరు వ్యక్తుల పేర్లు కొనసాగాయి. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో పోరంబోకు/సర్కారీ గైరానా అని నమోదవుతూ వస్తోంది. చివరకు 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. దీంతో ఈ భూముల జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ, కొందరు పేర్లు మాత్రం అనుభవదారుల కాలమ్‌లో రాశారు. సేత్వారీలో గతంలో పట్టాగా నమోదైందని చెబుతూ దీని ఆధారంగానే మిగతా వ్యవహారమంతా నడిపి ఫైల్ క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది.

సమగ్ర కులగణనకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవులు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచే వరకు తమ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఐఏఎస్ విశ్రాంత అధికారి చిరంజీవులు అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ, మహిళా, విద్యార్థి యువజన సంఘాల సమావేశంలో సమగ్రకుల గణన సాధన యాత్ర వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14న కామారెడ్డిలో సమగ్ర కులగణన సాధన యాత్ర ప్రారంభమై 15 రోజులపాటు 10 జిల్లాల గుండా సాగి కరీంనగర్‌లో ముగుస్తుందన్నారు. కులగణన ప్రక్రియను నెల రోజుల్లో పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. బీసీ మేధావులు, కుల సంఘాలు, విద్యావంతులు, మహిళలు పెద్దఎత్తున ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కుందారం గణేషాచారి, వేముల వెంకటేష్, ఉప్పర శేఖర్ సగర, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్‌కుర్మ, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వెంచర్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విజయరాఘవన్

నల్లకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, సుభాన్‌పూర్ ప్రాంతంలో అక్రమంగా వెంచర్లు వేసి ఒకే ప్లాట్‌ను ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని నేషనల్ సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేషనల్ సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ సలహాదారు, విశ్రాంత తహసీల్దార్ విజయరాఘవన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి సాయితేజ బాధితులు ఎనుముల సురేందర్, కొల్లు దుర్గాప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. మహేశ్వరం మండలం సుభాన్‌పూర్ సర్వే నంబర్ 13-9, 228, 98, 91,224, 225లో 21 ఎకరాల 31 గుంటలలో అక్రమంగా లే అవుట్ చేసి ప్లాట్లను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి తిరిగి డబ్బు చెల్లించాలని కోరారు.

రేపు మున్నూరుకాపు ప్రజాప్రతినిధులకు సత్కారం

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 14న మున్నూరుకాపు ప్రజాప్రతినిధులకు సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నామని మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సత్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మహాసభ నాయకులు హనుమంతరావు, గోపాల రాధాకృష్ణ, కొండూరు వినోద్‌కుమార్, జితేందర్, కట్టెల సుభాష్, కొమ్ము శ్రీనివాస్, సురేష్‌బాబు, దయానందం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

ప్రతిఘటన పోరాట నిర్మాణంలో రాధక్క పాత్ర : ఐఎఫ్‌టీయూ

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ రాధక్క ప్రతిఘటన పోరాటాన్ని నిర్మించడంలో తనదైన పాత్ర పోషించారని ఐఎఫ్‌టీయూ నేతలు కొనియాడారు. శుక్రవారం విద్యానగర్‌లో సీపీ భవన్‌లో ఈ నెల 14న జరిగే రాధక్క సంతాప సభ పోస్టర్‌ను ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. భారత విప్లవోద్యమ చరిత్రలో ప్రతిఘటన పోరాటానికి గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో ఎంతో చరిత్ర ఉందన్నారు. రాధక్క జీవితం చివరి శ్వాస వరకు పోరాటాలతోనే కొనసాగిందని శ్లాఘించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నాగరాజు, కొండల్, వెంకన్న, యశ్వంత్ పాల్గొన్నారు.

నాలా పనులను వేగంగా పూర్తి చేయండి



నాలా పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కింగ్ ప్యాలెస్ వీధిలో చేపట్టిన నాలా పనులను వేగంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. నాలా పనులను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కండర క్షీణిత సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి

విజయవంతంగా సర్జరీ

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కండర క్షీణిత(హిరాయమా) సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి విజయవంతంగా సర్జరీ పూర్తి చేశామని కాచిగూడ టీఎక్స్ ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ నరేష్‌కుమార్ తెలిపారు. తొలిసారిగా ఈ అరుదైన సర్జరీ చేశామన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సందీప్‌కుమార్, డాక్టర్ కీర్తికర్ రెడ్డి, డాక్టర్ దీపక్‌రాజ్, డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్ వోడ్నాల సహకారంతో సర్జరీ విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కండర క్షీణిత సమస్య వల్ల చేతులు, మణికట్టు కండరాలు బలహీనమవుతాయని, 15 నుంచి 25 ఏళ్ల వయస్సు గల వారిని ప్రభావితం చేస్తుందన్నారు. ఈ సమస్యతో బాధపడుతున్న వారికి మెడ భాగాన వెన్నెముక లోపం వస్తుందని తెలిపారు.

